

లక్నోలో మాక్ డ్రిల్ రిహార్సల్‌లో పాల్గొన్న పౌర రక్షణ సిబ్బంది

# బ్లాకౌట్స్ టు బంకర్స్!

## దేశవ్యాప్తంగా సెక్యూరిటీ డ్రిల్ జరిగే తీరు ఇదీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈ క్రమంలో బుధవారం దేశవ్యాప్తంగా 259 ప్రాంతాల్లో సెక్యూరిటీ డ్రిల్స్‌ను నిర్వహించనున్నారు. దీంతో అసలు సెక్యూరిటీ డ్రిల్ అంటే ఏమిటి? ఎందుకు నిర్వహిస్తారు? గతంలో ఎప్పుడైనా నిర్వహించారా? డ్రిల్ నిర్వహణలో ఉండే క్యాటగిరీలేమిటి? అనే చర్చ జరుగుతున్నది.

### ఏమిటీ సెక్యూరిటీ డ్రిల్?

సెక్యూరిటీ మాక్ డ్రిల్ అనేది ఒక రక్షణకు సంబంధించిన శిక్షణ ప్రక్రియ. రక్షణ వ్యవస్థ పనిచేస్తున్నదా లేదా అని పరీక్షించి, భవిష్యత్తులో ప్రాణనష్టం జరగకుండా ముందస్తుగా ప్రతిస్పందించడానికి అనుసరించే మార్గం. ప్రమాదం జరుగడానికి ముందే.. ఆ ప్రమాదానికి ఎలా ప్రతిస్పందించాలో ప్రాక్టీస్ చేయడంగా దీనిని పేర్కొనవచ్చు.

### ఎందుకు నిర్వహిస్తారు?

ప్రజలలో అప్రమత్తత కల్పించడానికి, సిబ్బంది వెంటనే స్పందించి, నైపుణ్యతతో పరిస్థితులను చక్కదిద్దడానికి, సాంకేతిక లోపాలను ముందుగా గుర్తించి సరిచేసుకోవడానికి, ఎమర్జెన్సీ సమయంలో ప్రతిస్పందన బృందాలు సమన్వయంతో ఏ మేరకు పనిచేయగలవో పరీక్షించడానికి ఈ డ్రిల్‌ను నిర్వహిస్తారు.

### ఏ సమయాల్లో డ్రిల్ చేపడతారు?

యుద్ధం, ఉగ్రదాడులు, బహుళ అంతస్తుల భవనాలు-దవాఖానల్లో అగ్నిప్రమాదం, భూకంపం, వరదలు, తుఫాన్లు, కెమికల్ లీకేజీ వంటి సందర్భాల్లో సాధారణంగా ఈ డ్రిల్‌ను నిర్వహిస్తారు. ఆయా వ్యక్తులు, సంస్థలకు ముందుగా తెలిపి కానీ, తెలపకుండా హఠాత్తుగా గానీ ఈ డ్రిల్స్‌ను నిర్వహిస్తారు.



ఢిల్లీలో మాక్ డ్రిల్ నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న సైనికులు, పోలీసులు

## సెక్యూరిటీ డ్రిల్స్‌లో ఉండే ప్రధాన దశలు



**ఎయిర్ రైడ్ వార్నింగ్ సైరన్లు:** సెక్యూరిటీ డ్రిల్‌లో ఇది కీలకమైన దశ. వైమానిక దాడులు జరిగే సమయంలో ఎయిర్ రైడ్ వార్నింగ్ సైరన్లను మోగిస్తారు. ధ్వని తీవ్రత 110 డెసిబిల్స్ నుంచి 140 డెసిబిల్స్ వరకూ ఉంటుంది. కనిష్ఠంగా 30 సెకండ్లపాటు ఈ వార్నింగ్ సైరన్లు మోగుతాయి. సైరన్ వినిపించగానే ప్రతీఒక్కరూ ఇండ్లల్లో సురక్షిత ప్రదేశాల్లో దాక్కోవాలి. బయట వీధుల్లో ఉండేవారు లోతట్టు ప్రాంతానికి చేరుకొని పై కప్పు ఉన్న ఏదైనా వసారాలో నేలపై పడుకోవాలి. చెవులను గట్టిగా మూసుకోవాలి.



**బంకర్లు:** దాడులు మొదలైన సందర్భంలో పౌరులు ప్రాణాలను కాపాడుకోవడానికి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. భూమి లోపల తవ్విన బంకర్ల వంటి నిర్మాణాల్లో దాక్కోవడం ఉత్తమం. ఉద్రిక్తతలు ఎక్కువగా ఉండే కశ్మీర్‌లోని ఉరి ప్రాంతం, అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలోని అర్నియా ప్రాంతాల్లో ప్రభుత్వం ఇప్పటికే పౌరుల కోసం కొన్ని కమ్యూనిటీ బంకర్లను సిద్ధం చేసింది.

**క్రాష్ బ్లాకౌట్స్:** రాత్రిళ్లు జరిగే దాడుల నుంచి రక్షణ పొందేందుకు ఈ అంచెను అనుసరిస్తారు. ఈ విధానంలో ఇండ్లల్లోని దీపాలన్నింటినీ ఆర్పేయాలి. స్ట్రీట్ లైట్లు కూడా నిలిపేస్తారు. మొత్తంగా జనావాసాలు అక్కడ ఉన్నాయా? లేదా? అనే భ్రమను శత్రువులకు కల్పిస్తారు.



**కేమోఫ్లాజ్ విధానం:** సైనిక స్థావరాలు, విద్యుత్తు స్టేషన్లు, ప్రభుత్వ భవనాలు, రక్షణ రంగ సంస్థలు, కమ్యూనికేషన్ హబ్స్ వంటి కీలమైన ప్రాంతాలు ఎక్కడ ఉన్నాయో కూడా గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉండేందుకు ఈ కేమోఫ్లాజ్ విధానాన్ని అనుసరిస్తారు. ఉపగ్రహాలు, గగనతల నిఘా, దాడుల నుంచి తప్పించుకోవడానికి ఇలా చేస్తారు. 1971 యుద్ధంలో ఆకుపచ్చని జూట్ వస్త్రంతో కప్పి కేమోఫ్లాజ్ విధానంలోనే తాజ్‌మహల్‌ను రక్షించారు.



**ట్రైనింగ్ సివిలియన్స్:** దాడుల సమయంలో తొక్కిసలాట, గందరగోళం జరగకుండా నియమిత విధానంలో బయటకు ఎలా వెళ్లాలో పౌరులకు శిక్షణనిస్తారు. ప్రమాదంలో చిక్కుకొని గాయపడ్డ వారిని ఎలా కాపాడాలో పౌరులకు నేర్పిస్తారు. సురక్షిత ప్రాంతానికి వెళ్లిన తర్వాత హాజరు నమోదు ఎలా చేయాలో కూడా చెప్తారు.



**ఎమర్జెన్సీ రెస్పాన్స్:** అత్యవసర పరిస్థితి ఏర్పడిన వెంటనే అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు, బృందాలు ఘటనా స్థలికి చేరుకుంటాయి. లోపల ప్రమాదంలో చిక్కుకున్న లేదా బందీలైన వ్యక్తులను బయటకు తీసుకురాగలుగుతామా? అని డ్రిల్‌లో భాగంగా పరీక్షిస్తారు. ఉగ్రదాడి అయితే ఉగ్రవాదులను కట్టడి చేసే అవకాశాలను, ప్రక్రియను ఆచరిస్తారు. అలాగే ఆపరేషన్ అయిన తర్వాత ప్రతిస్పందన సమయం నమోదు చేస్తారు. అన్ని శాఖలు, విభాగాలపై సమీక్ష జరిపి ఏ విభాగంలో లోపాలున్నాయి, ఎందులో మెరుగుదల అవసరం వంటి అంశాలను డ్రిల్‌లో సమీక్షిస్తారు.

### 1971 యుద్ధ సమయంలో ఇలా..

1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసమని భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగింది. ఆ సమయంలో పౌరుల భద్రత కోసమని అప్పటి ప్రభుత్వం యుద్ధానికి ముందు సెక్యూరిటీ డ్రిల్స్‌ను నిర్వహించింది. యుద్ధ సమయంలో సాయంత్రం 6.30 కల్లా ప్రతీఒక్కరూ ఇండ్లకు చేరుకొనేవారు. సైరన్ వినిపించగానే ప్రతీ ఒక్కరూ లైట్లు ఆర్పేసి ఇండ్లల్లో సురక్షిత ప్రదేశాల్లో దాక్కొనేవారు. నేలపై పడుకొనేవారు. చెవులను గట్టిగా మూసుకొనేవారు. ఆ సమయాల్లో పెద్దగా మాట్లాడటం కూడా ఉండేది కాదు. పాక్ సేనలు తాజ్‌మహల్‌పై దాడులకు పాల్పడే ప్రమాదమున్నదన్న నిఘా వర్గాల హెచ్చరికలతో ఆ కట్టడం శత్రువు కంటపడకుండా పరిసరాల్లో కలిసిపోయేట్టు కనిపించడానికి దానిపై ఆకుపచ్చటి జూట్ వస్త్రాన్ని (కేమోఫ్లాజ్ వస్త్రం) కప్పారు.



# క్యాటగిరీ-2లో హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి...

వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. పోలీసు, అగ్నిమాపక సర్వీసులు, విపత్తు నిర్వహణ దళం సంయుక్తంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వానికి చెందిన సీనియర్ అధికారి ఒకరు మంగళవారం తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో సాయంత్రం 4 గంటలకు సైరన్ మోగడం(వైమానిక దాడికి హెచ్చరికగా) ప్రారంభమవుతుందని, మాక్ డ్రిల్ ముగింపునకు సూచనగా తిరిగి సాయంత్రం 4.30 గంటలకు సైరన్ మోగుతుందని ఆ అధికారి చెప్పారు. సైరన్ మోగిన వెంటనే ప్రజలు తమకు తాముగా షెల్టర్ జోన్‌లోకి వెళ్లిపోవలసి ఉంటుందని ఆయన తెలిపారు. క్యాటగిరి -1లో న్యూఢిల్లీ, ఢిల్లీ కంటోన్మెంట్, సూరత్, వడోదర, కాక్రపార్, ముంబై, కోటా, కల్పకం, బులంద్ షహర్ వంటివి ఉన్నాయి.

**దేశవ్యాప్తంగా 244 జిల్లాలలో...**

కాగా, దేశవ్యాప్తంగా 244 జిల్లాలలో బుధవారం జరగనున్న మాక్ సెక్యూరిటీ డ్రిల్‌కు రంగం సిద్ధమైంది. శత్రు దాడి జరిగిన పక్షంలో ప్రజలు తమను తాము రక్షించుకునేందుకు తీసుకోవలసిన చర్యలలో శిక్షణ ఇచ్చేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సంసిద్ధమవుతున్నాయి. వైమానిక దాడికి సంబంధించిన సైరన్లకు ఎలా స్పందించాలి, సురక్షిత ప్రదేశాలకు తరలిపోవడం, బంకర్లు, కందకాలను శుభ్రం చేసుకోవడం తదితర అంశాలలో ప్రజలకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అణు కర్మాగారాలు, సైనిక స్థావరాలు, రిఫైనరీలు, హైడ్రోఎలక్ట్రిక్ డ్యాంలు వంటి కీలక ప్రదేశాలలో మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. 1971 తర్వాత అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఎలా ఉండాలన్న విషయమై మొదటిసారి ప్రజలకు శిక్షణ లభించనున్నది. దేశవ్యాప్తంగా సాయంత్రం 4 గంటలకు మాక్ డ్రిల్ ప్రారంభం కానున్నది. మాక్ డ్రిల్‌లో దాదాపు 6 లక్షల మంది వలంటీర్లు పాల్గొనవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రతరమైన నేపథ్యంలో ఎదురవుతున్న జటిలమైన హెచ్చరికల కారణంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో మాక్ డ్రిల్స్ నిర్వహించాల్సిన ఆవశ్యకతను కేంద్ర హోం శాఖ సోమవారం తెలియచేసింది. ఈ మాక్ డ్రిల్స్‌లో విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, దవాఖాన సిబ్బంది, రైల్వే, మెట్రో అధికారులతోపాటు పోలీసు, పారామిలిటరీ, రక్షణ దళాల సిబ్బంది పాల్గొంటారని అధికార వర్గాలు తెలిపాయి. ఢిల్లీ, చెన్నై, ముంబై, కోల్‌కతా వంటి మెట్రో నగరాలతోపాటు అణు కేంద్రాలు వంటి కీలక స్థావరాలు లేదా సరిహద్దు వెంబడి ఉన్న నగరాలను శత్రు దాడులు జరిగేందుకు అవకాశం ఉన్న కీలక జోన్లుగా పరిగణిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ జోన్ల సామర్థ్యాన్ని తనిఖీ చేయడంతోపాటు ఎక్కడైనా లోపాలుంటే సివిల్ డిఫెన్స్ అధికారులు సరిచేస్తారని వర్గాలు వివరించాయి. కీలక జోన్లను గుర్తించే ప్రక్రియ మరో మూడు రోజులు కొనసాగుతుందని వారు తెలిపారు.

**హోం కార్యదర్శి ఉన్నత స్థాయి సమావేశం**

కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం మంగళవారం ఉదయం ఢిల్లీలో జరిగింది. ప్రజల క్రియాశీలక భాగస్వామ్యంతో మాక్ డ్రిల్ ఎలా నిర్వహించాలన్న విషయమై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నతస్థాయి సివిల్, పోలీసు అధికారులు పాల్గొన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో మాక్ డ్రిల్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపాయి. "ఆపరేషన్ అభ్యాస్" పేరిట నిర్వహించనున్న ఈ రిహార్సల్స్‌కు సంబంధించిన మార్గదర్శకాల జాబితాను ఢిల్లీ ప్రభుత్వం విడుదల చేసింది. దేశ రాజధాని వ్యాప్తంగా 55 ప్రదేశాలలో మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. వైమానిక దాడి సైరన్లను గుర్తించడం, సమీపంలోని బేస్‌మెంట్లు, అండర్ గ్రౌండ్ కారు పార్కింగ్ స్థలాలు, ఇతర సురక్షిత జోన్లను గుర్తించడం, టార్చి, ఎమర్జెన్సీ కిట్, నీళ్ల సీసాలు వంటివి సిద్ధంగా ఉంచుకోవడం వంటి విషయాలపై పౌరులకు శిక్షణ ఇవ్వనున్నారు. సైరన్లు వినిపించినపుడు వెంటనే అప్రమత్తమై బయటి పనులు మానేసి సమీపంలోని సురక్షిత ప్రదేశాలకు చేరుకోవడం, ఎమర్జెన్సీ సర్వీసులకు కమ్యూనికేషన్ అంతరాయం కలుగకుండా ఫోన్ల వాడకాన్ని నిలిపివేయడం వంటివి ప్రజలు చేయాల్సిన పనులని అధికారులు తెలిపారు. కశ్మీరులో సాయంత్రం 4 గంటలకు మాక్ డ్రిల్ జరుగుతుందని ఆ రాష్ట్ర విపత్తు నిర్వహనా దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్), సివిల్ డిఫెన్స్ ప్రకటించాయి.

## సరిహద్దుల్లో యుద్ధ విమానాల గర్జన

### నేడు, రేపు వాయుసేన విన్యాసాలు

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాక్‌తో అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి వాయుసేన రెండు రోజులపాటు వైమానిక విన్యాసాలను చేపట్టనుంది. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మొదలయ్యే ఈ డ్రిల్స్.. గురువారం రాత్రి 9.30 గంటలకు ముగుస్తాయని అధికార వర్గాలు వెల్లడించాయి. రాఫెల్, మిరాజ్-2000, సుఖోయ్-30ఎస్, తేజస్ తదితర యుద్ధ విమానాలు ఈ విన్యాసాల్లో పాల్గొననున్నట్టు తెలిపాయి. భారత వాయుసేన సామర్థ్యాలను ఈ విన్యాసాల్లో ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నాయి.



## మాపై దాడి చేస్తే ఎవరూ మిగలరు

### చరిత్ర గుర్తుంచుకునే జవాబిస్తాం ▪ పాక్ రక్షణ మంత్రి వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: భారత్ ఎటువంటి చౌరబాట్లకు కాని పాకిస్థాన్ భద్రతను దెబ్బతీసే ప్రయత్నం కాని చేసిన పక్షంలో పాకిస్థాన్ నుంచి చారిత్రాత్మక జవాబును ఎదుర్కోవలసి వస్తుందని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మంగళవారం పునరుద్ఘాటించారు. పాకిస్థాన్‌పై దాడి చేసేందుకు భారత్ సాహసిస్తే ఎవరూ ప్రాణాలతో ఉండరని ఆయన హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉభయ దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి దరిమిలా భారత్ పాక్‌పై అనేక దౌత్య, ఆర్థికపరమైన ఆంక్షలతోపాటు సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు కూడా ప్రకటించింది. పాక్‌పై భారత్ ఏ క్షణమైనా దాడి చేయవచ్చని తమ వద్ద నిఘా సమాచారం ఉన్నట్లు ఆసిఫ్‌తోపాటు పలువురు మంత్రులు ఇప్పటికే ప్రకటించారు. 'మేము లేకపోతే ఇక ఎవరూ మిగలరు' అని ఓ టీవీ ఇంటర్వ్యూలో ఆసిఫ్ తెలిపారు.

## జాతీయ భద్రతపై పాక్ పార్లమెంట్ సమావేశం

### కీలక మంత్రుల గైర్హాజరుపై విపక్షాల ఆగ్రహం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌పై భారత్ యుద్ధానికి దిగుతుందన్న ఊహాగానాల నడుమ మంగళవారం పాక్ పార్లమెంట్ కీలక సమావేశాన్ని నిర్వహించింది. జాతీయ భద్రతపై నిర్వహించిన ఈ సమావేశానికి అధికార పార్టీకి చెందిన కీలక మంత్రులు, పలువురు ఎంపీలు హాజరుకాకపోవటంపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దేశంలోని ముఖ్య నేతల్లో ఒకరైన జేయూఐ చీఫ్ మౌలానా ఫజ్లూర్ రెహమాన్ షెహబాజ్ షరీఫ్ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి రెహమాన్, జేయూఐ ఎంపీలు వాకౌట్ చేశారు. భారత్‌కు దీటుగా స్పందించటం లేదంటూ పలువురు ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు సభలో షెహబాజ్ సర్కార్, భారత్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ ఏకపక్షంగా ఉల్లంఘించిందని, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా యుద్ధ చర్యలు చేపడుతున్నదని ఆ తీర్మానంలో పాక్ ఆరోపించింది.

## మాస్కోపై డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

మాస్కో: విక్టరీ డే (మే 9న)కు సిద్ధమవుతున్న రష్యా రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో మాస్కోలోని నాలుగు విమానాశ్రయాల్లో విమాన రాకపోకల్ని అధికారులు నిలిపివేశారు. మాస్కోలో నిర్వహిస్తున్న మిలటరీ పరేడ్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సహా పలువురు ప్రపంచ స్థాయి నేతలు ముఖ్య అతిథులుగా పాల్గొనబోతున్నారు. ఈ తరుణంలో మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను చేపట్టడం సంచలనం రేపింది.

## జర్మనీ చాన్స్‌లర్‌గా మెర్జ్

బెర్లిన్: జర్మనీ నూతన చాన్స్‌లర్‌గా కన్జర్వేటివ్ నేత ఫ్రెడరిక్ మెర్జ్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆ దేశ పార్లమెంట్‌లో నిర్వహించిన ఓటింగ్‌లో తొలుత అనూహ్యంగా పరాజయం పాలైనా, రెండో రౌండ్ ఓటింగ్‌లో గట్టెక్కారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ చాన్స్‌లర్ ఎన్నికల్లో ఏ నాయకుడు కూడా మొదటి రౌండ్ వోటింగ్‌లో ఓడిపోలేదు. రెండో రౌండ్ ఓటింగ్‌తో చాన్స్‌లర్ పదవి దక్కించుకున్న నాయకుడిగా మెర్జ్ నిలిచారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం

- 1.5 లక్షల వరకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్
- గరిష్ఠంగా ఏడు రోజుల పాటు చికిత్స
- కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ, మే 6: రోడ్డు ప్రమాద బాధితులకు లక్షన్నర రూపాయల వరకు ఉచిత వైద్య చికిత్సను అందించే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం సోమవారం నుంచి అమలులోకి వచ్చినట్టు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ ఒక నోటిఫికేషన్ ద్వారా వెల్లడించింది. 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం,2025' అని ఈ పథకానికి పేరు పెట్టారు. ప్రమాదం జరిగిన మొదటి ఏడు రోజుల్లో సమీపంలోని ఏదైనా దవాఖానలో ఉచిత వైద్య సేవలు పొందవచ్చునని కేంద్రం తెలిపింది. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లోఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు గత జనవరిలో ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్రం ఈ నోటిఫికేషన్ జారీ చేసింది.

**మరణాల సంఖ్యను తగ్గించేందుకు..**

రోడ్డు ప్రమాదాల్లో సరైన సమయంలో వైద్యం అందక జరిగే మరణాల సంఖ్యను తగ్గించేందుకే ఈ పథకాన్ని అమలులోకి తెచ్చినట్టు కేంద్రం తెలిపింది. ఎటువంటి మోటారు వాహనంపై ప్రయాణిస్తున్నవారైనా, ఏ రోడ్డు మీద ప్రమాదానికి గురైనా ఈ పథకం కింద దవాఖానల్లో రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు పొందవచ్చని ఆ నోటిఫికేషన్‌లో వివరించింది. పోలీసులు, దవాఖానలు, రాష్ట్రాల ఆరోగ్య సంస్థల సహకారంతో జాతీయ ఆరోగ్య సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) ఈ పథకాన్ని అమలు చేస్తుందని తెలిపింది. ఇందుకోసం రోడ్డు రవాణాశాఖ కార్యదర్శి నేతృత్వంలో 11 మందితో కూడిన ఒక స్టీరింగ్ కమిటీని ఏర్పాటుచేసింది. రాష్ట్రాలలో రోడ్డు భద్రతా మండలి ఈ పథకం అమలుకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని పేర్కొంది. రోడ్డు ప్రమాద బాధితులను దవాఖానకు తెచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాలని, ఒకవేళ తమ వద్ద సౌకర్యాలు లేకపోతే వెంటనే మరో దవాఖానకు పంపాలని తెలిపింది. బాధితుడు డిశ్చార్జి అయ్యాక దవాఖాన అతడి బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.



## సుప్రీంకోర్టు జడ్జీల ఆస్తుల వివరాల వెల్లడి

- *21 మంది అందజేత*
- *వెబ్‌సైట్‌లో అప్‌లోడ్*

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో పారదర్శకతను పెంపొందించడంలో భాగంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని ఏప్రిల్ 1న ఫుల్ కోర్టు తీసుకున్న నిర్ణయం మేరకు పలువురు న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను అందించారు. వాటిని సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఆ వివరాల ప్రకారం.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా రూ. 55.75 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు కలిగి ఉన్నారు. అలాగే, దక్షిణ ఢిల్లీలో మూడు బెడ్రూంల డీడీఏ ఫ్లాట్, కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో 2,446 చదరపు అడుగులతో కూడిన నాలుగు బెడ్రూంల అపార్ట్‌మెంట్‌తో పాటు మరికొన్ని లక్షల విలువైన స్థిర చరాస్తులు ఉన్నాయి. తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్ బ్యాంకు ఖాతాలో రూ. 19.63 లక్షల నగదు, ముంబై, ఢిల్లీలో అపార్ట్‌మెంట్లు మరికొన్ని ఆస్తులు ఉన్నాయి. మొత్తం 33 మంది న్యాయమూర్తులలో 21 మంది తమ ఆస్తుల వివరాలను ప్రజల ముందుంచారు.

## రైలు బోగీల్లా మారిన రిజర్వేషన్లు

- లోపలున్న వారికి ఇతరులు రావడం ఇష్టం ఉండదు
- కొందరికే దక్కుతున్న ఫలాలు
- వెనుకబడిన ప్రజలను గుర్తించే బాధ్యత ప్రభుత్వాలదే
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: దేశంలో కులాధారిత రిజర్వేషన్లు రైలు బోగీల్లా మారిపోయాయని, రైలు బోగీలోకి ఎక్కిన వారు ఇతరులు అందులోకి రావడానికి ఇష్టపడరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ ఏడాది చివరిలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇతర వెనుకబడిన తరగతులకు(ఓబీసీ) రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ మంగేష్ శంకర్ సలసానే తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ వాదనలు వినిపిస్తూ రాజకీయంగా వెనుకబడ్డారా అన్న విషయాన్ని నిర్ధారించుకోకుండానే మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన జయంత కుమార్ బంథియా సారథ్యంలోని కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ 'ఈ దేశంలో కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు బోగీల్లా మారిపోయాయి. అందులో ఉన్న వారికి ఇతరులు లోపలకు రావడం ఇష్టం ఉండదు. ఇదో పెద్ద ఆట. పిటిషనర్ కూడా బహుశా ఇదే ఆట ఆడుతుండవచ్చు. కాని, అందరినీ కలుపుకుని పోవడమే రిజర్వేషన్ల మూల సిద్ధాంతం. మరిన్ని తరగతులను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ప్రజలు ఉన్నారు. రిజర్వేషన్ ప్రయోజనాలు వారికి ఎందుకు దక్కవు? కొన్ని కుటుంబాలు, కొన్ని గ్రూపులకు మాత్రమే రిజర్వేషన్ ప్రయోజనాలు దక్కుతున్నాయి' అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

## భారత్, యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

### భారత్‌లో తగ్గనున్న బ్రిటిష్ విస్కీ, కార్ల ధరలు

లండన్: భారత్-యూకే మధ్య చరిత్రాత్మకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదిరింది. ఇరు దేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయల్, జొన్నాథన్ రేనాల్డ్స్‌లు గత శుక్రవారం ఖరారు చేసిన తుది ఒప్పందానికి మంగళవారం రెండు దేశాలూ ఆమోదం తెలిపాయి. ఎఫ్‌టీఏ చర్చలు విజయవంతంగా ముగిసినట్టు ఇరు దేశాల ప్రధానులు మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ఒప్పందం నేపథ్యంలో భారత్‌లో బ్రిటీష్ విస్కీ, జిన్, కార్ల ధరలు తగ్గనున్నాయి. యూకే ఆటోమొబైల్ ఉత్పత్తులపై ఇప్పుడున్న 100 శాతం టారిఫ్ 10 శాతానికి తగ్గిస్తారు. ఇరు దేశాల వాణిజ్యానికి ఎఫ్‌టీఏ కొత్త మార్గాలను వేస్తుందని, ద్వైపాక్షిక పెట్టుబడులను పెంచుతుందని, ఆర్థిక వృద్ధి, ఉద్యోగ సృష్టి పెంచుతుందని, ఇరు దేశాల దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పునాది వేస్తుందని భారత్, యూకే ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

## సీయూఈటీ-పీజీ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ వర్సిటీల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన 'సీయూఈటీ-పీజీ-2025' పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. మంగళవారం రాత్రి పరీక్ష ఫలితాల్ని ఎన్‌టీఏ విడుదల చేసింది. మార్చి 13, ఏప్రిల్ 1న దేశవ్యాప్తంగా నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు, తమ స్కోర్‌ను exams.nta. ac.in/ CUET-PG వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## సీయూఈటీ యూజీ వాయిదా!

న్యూఢిల్లీ: ఈ నెల 8 నుంచి జరగాల్సిన దికామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)-యూజీ పరీక్షను వాయిదా వేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. పరీక్ష జరిగే తాజా తేదీలను త్వరలో ప్రకటించనున్నట్టు పేర్కొన్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించి సీయూఈటీ-యూజీకి ఈ సంవత్సరం 13.5 లక్షల దరఖాస్తులు వచ్చాయి. కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఈ పరీక్ష జరగనుంది.

## ప్రధానితో మరోసారి ధోవల్ భేటీ

### కీలక వ్యక్తులతో మోదీ వరుస చర్చలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి సమాధానంగా పాకిస్థాన్‌పై భారత్ సైనిక దాడి జరపవచ్చని జోరుగా ఊహాగానాలు సాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీతో జాతీయ భద్రతా సలహాదారు(ఎన్‌ఎస్‌ఏ) అజిత్ ధోవల్ మంగళవారం సమావేశమయ్యారు. గడచిన 48 గంటల్లో ధోవల్ ప్రధానితో భేటీ కావడం ఇది రెండవసారి. 1971 తర్వాత మొట్టమొదటిసారి బుధవారం దేశవ్యాప్తంగా మాక్ సెక్యూరిటీ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించిన నేపథ్యంలో వీరిద్దరూ సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గడచిన రెండు మూడు రోజులలో ప్రధాని నరేంద్ర మోదీ రక్షణ రంగానికి సంబంధించిన కీలక వ్యక్తులతో వరుసగా ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్‌ఎస్‌ఏ ధోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల ప్రధానాధికారులతో ఆయన చర్చలు జరిపారు. గత వారం ధోవల్, జనరల్ చౌహాన్‌తో సమావేశమైన ప్రధాని మోదీ పాక్‌పై సైనిక చర్యకు సంబంధించి పూర్తి స్వేచ్ఛను సాయుధ దళాలకే వదిలిపెడుతున్నట్లు ప్రకటించారు.

## రక్షణ బడ్జెట్‌ను 18% పెంచనున్న పాక్!

ఇస్లామాబాద్: భారత్‌తో ఉద్రిక్తతల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌లో రక్షణ రంగం కేటాయింపులను 18 శాతం పెంచాలని పాకిస్థాన్‌లోని సంకీర్ణ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రక్షణ రంగానికి రూ.2.5 లక్షల కోట్ల మేర కేటాయింపులు జరగనున్నట్లు మంగళవారం మీడియా కథనాలు వెలువడ్డాయి.

## ఐరాసలో పాక్‌కు చుక్కెదురు

- పహల్గాం ఉగ్రదాడిపై మండిపడ్డ భద్రతా మండలి

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడిపై మంగళవారం జరిగిన అంతర్గత సంప్రదింపుల సమావేశంలో పాకిస్థాన్ తీరుపై ఐరాస భద్రతా మండలి మండిపడింది. ఏఎన్‌ఐ మీడియా కథనం ప్రకారం.. ఉగ్రదాడిలో లష్కరే తాయిబా సంస్థ ప్రమేయం ఉందా? అని మండలి సభ్య దేశాలు పాక్‌ను ప్రశ్నించాయి. సమస్యను పాక్ అంతర్జాతీయికరణ చేసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇటీవల పాక్ జరిపిన అణు పరీక్షలపైనా సభ్య దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఉగ్రదాడిపై జవాబుదారీగా ఉండాలని పాక్‌ను కోరాయి. పర్యాటకుల్ని లక్ష్యంగా చేసుకొని చంపడాన్ని సమావేశంలో ప్రస్తావించారు.

## ఇక మన జలాలు మనకే: మోదీ

న్యూఢిల్లీ: ఇకపై భారత జలాలు దేశం దాటి వెళ్లవని, దేశ ప్రయోజనాలకే వాటిని వినియోగించనున్నట్టు ప్రధాని మోదీ స్పష్టంచేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌తో సింధూ జలాల ఒప్పందం నిలిపివేతను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఓ వార్తాసంస్థతో ఆయన మాట్లాడుతూ.. 'ఇదివరకు భారత్‌కు దక్కాల్సిన నీటి వాటా బయటకు వెళ్లిపోయేది. ఇకపై మన జలాలు మన దేశ ప్రయోజనాలకే వినియోగిస్తాం' అని స్పష్టంచేశారు.

## దాడి సంగతి తెలిసే మోదీ పర్యటన రద్దు!

### పహల్గాం పర్యాటకులకు ఎందుకు రక్షణ ఇవ్వలేదు: ఖర్గే

రాంచీ: పహల్గాం ఉగ్ర దాడి జరగడానికి మూడు రోజుల ముందు అక్కడ దాడులు జరిగే అవకాశం ఉన్నట్టు ప్రధానికి ఇంటెలిజెన్స్ నివేదిక అందిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ఆరోపించారు. అందుకే ప్రధాని తన కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని తెలిపారు. ఇంటెలిజెన్స్ వైఫల్యం వల్లే పహల్గాం మారణకాండ జరిగిందని కేంద్రం అఖిల పక్ష సమావేశంలో ఒప్పుకొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఖర్గే గుర్తుచేశారు. 'మీ భద్రత దృష్ట్యా మీరు కశ్మీర్‌లో పర్యటించడం క్షేమకరం కాదని మీకు తెలిసినప్పుడు.. అదే విషయాన్ని మీరు స్థానిక కశ్మీర్ బలగాలకు చెప్పి ప్రజలను ఎందుకు రక్షించలేదు? పర్యాటకుల భద్రత కోసం మరిన్ని బలగాలను ఎందుకు పంపలేదు?' అని ఖర్గే ప్రధాని మోదీని ప్రశ్నించారు.